బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 17 ఆగస్టు 2025 | www.balagamtv.com | పేజీలు 4

## భారీ వర్షాలపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం

- **ప్రత్యేక ఫ్లడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ, అత్యంత భారీ వర్షాలు కురుస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సహాయక చర్యలు చేపట్టేందుకు పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర స్థాయిలో ఈఎన్‌సీ (ఇంజినీర్ ఇన్ చీఫ్) కార్యాలయంలో ప్రత్యేకంగా ఫ్లడ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. రహదారుల్లో ఇబ్బందులు, ఇంజినీరింగ్ సమస్యలు తలెత్తితే ప్రజలు ఫిర్యాదు చేయడానికి 040-35174352 టోల్ ఫ్రీ నెంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు. ప్రతి సర్కిల్ స్థాయిలో సూపరింటెండెంట్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే స్థానిక అధికారులు తక్షణమే స్పందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎక్కడైనా రహదారులు దెబ్బతిన్నా, కల్వర్టులు కూలినా, గండ్లు పడినా వెంటనే సంబంధిత నంబర్లకు సమాచారం ఇవ్వాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# మరింత అప్రమత్తంగా ఉండాలి....

- **భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన**
- **క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని అధికారులు, సిబ్బందికి ఆదేశం...**




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం.. జగిత్యాల మినహా 15 జిల్లాల్లో అధిక వర్షపాతం, మిగతా జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని సీఎం తెలిపారు. నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం ఉన్నతాధికారులతో మాట్లాడారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించామని, వారు కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడతారని సీఎం తెలిపారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని సీఎం ఆదేశించారు. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని సీఎం ఆదేశించారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించాలని.... పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలన్నారు. నిరంతరాయంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున నగర, పురపాలక, గ్రామ పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ తగినంత మందులు అందుబాటులో ఉంచుకోవాలని... అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం చోటుచేసుకోకుండా జాగ్రత్తలు వహించాలని సీఎం తెలిపారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య, పురపాలక, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సమన్వయంతో సాగాలని సీఎం సూచించారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## నచ్చని వారిపై అధికారాన్ని వినియోగించడం మూర్ఖత్వం



- **పదవిలోకి రావడం భగవంతుని బాధ్యత**
- **నేను ఎవరిని శత్రువుగా చూడను**
- **గద్దర్, అందెశ్రీ లాంటి వారే నిజమైన ఉద్యమకారులు**
- **సీఎం రేవంత్ రెడ్డి**
- **వాక్కులమ్మ ప్రచురణ నుంచి వెలువడిన హసిత బాష్పాలు (కావ్యరూపం) పుస్తకావిష్కరణ**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రపంచంలోనే ఒక గొప్ప అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలన్నదే తన జీవిత ఆశయమని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజల సమస్య పరిష్కరించడానికి తనకు ఒక అవకాశం వచ్చిందంటే శ్రీకృష్ణ భగవానుడి ఆశీస్సులు ఉన్నాయని భావిస్తానని చెప్పారు. టీజీ జెన్కో ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాక్కులమ్మ ప్రచురణ నుంచి వెలువడిన హసిత బాష్పాలు (కావ్యరూపం) పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించి, రచయిత శ్రీరామ్ గారిని, అందెశ్రీ గారిని అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.."ఒక సాధారణ వ్యవసాయ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన నేను 4 కోట్ల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పని చేయకుండా, ఎవరో నచ్చలేదని వారిపై ఈ అధికారాన్ని వినియోగిస్తే అంతకన్నా మూర్ఖత్వం ఉండదు. నేను ఎవరినీ శత్రువుగా మిగితా 2వ పేజీలో

## గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు సరికాదు

- **సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్లు, రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవడానికి స్థిరమైన గడువులు విధించడం రాజ్యాంగ అసమతుల్యతకు దారితీస్తుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు స్పష్టం చేశారు. ఒక రాజ్యాంగ అవయవానికి లేని అధికారాన్ని మరో అవయవం స్వీకరించినట్లవుతుందని, ఇది "రాజ్యాంగ అవ్యవస్థ"కు కారణమవుతుందని ఆయన వాదించారు. స్పష్టమైన గడువులను రాజ్యాంగం ఉద్దేశపూర్వకంగానే ప్రస్తావించలేదని, ఆ సౌలభ్యం కోల్పోతే రాజ్యాంగ సమతుల్యం దెబ్బతింటుందని మెహతా అభిప్రాయపడ్డారు. న్యాయస్థానం విధించే గడువులు రాజ్యాంగ వ్యవస్థను మార్చేసినట్లవుతుందని హెచ్చరించారు. ఈ ఆలస్యాలను పరిష్కరించడానికి ప్రజాస్వామ్య పద్ధతులు, శాసన పర్యవేక్షణ, కార్యనిర్వాహక బాధ్యత, సంప్రదింపుల విధానం వంటివి ఉపయోగించాల్సిన అవసరముందని, న్యాయస్థానం జోక్యం అవసరం లేదని పేర్కొన్నారు.

గవర్నర్, రాష్ట్రపతి పదవులు ప్రజాస్వామ్యానికి కీలకమని, వాటి అధికారాలను మరొక అవయవం హరించకూడదని మెహతా స్పష్టం చేశారు. అలా జరిగితే రాజ్యాంగ అవయవాల మధ్య సమతుల్యం దెబ్బతింటుందని హెచ్చరించారు.

ఏప్రిల్ 2025లో సుప్రీంకోర్టు గవర్నర్లకు ఒక నెల, రాష్ట్రపతికి మూడు నెలలు గడువు విధిస్తూ తీర్పు ఇచ్చింది. దీన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఆర్టికల్ 143(1) కింద ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్ ఇచ్చారు. ఈ అంశంపై విచారణను సుప్రీంకోర్టు ఆగస్టు 19 నుంచి ప్రారంభించనుంది.

## కాల్పుల విరమణపై ఒప్పందం కుదరలేదు




- **అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్**
- **అలాస్కాలో ట్రంప్-పుతిన్ కీలక భేటీ**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య అలాస్కాలో 2.30 గంటలపాటు కీలక చర్చలు జరిగాయి. అయితే కాల్పుల విరమణపై ఎలాంటి తుది ఒప్పందం కుదరలేదు. మరోసారి సమావేశం కావాలని పుతిన్ ప్రతిపాదించగా, తదుపరి భేటీకి మాస్కోకు రావాలని ట్రంప్‌ను ఆహ్వానించారు.


సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన ట్రంప్ మాట్లాడుతూ, "పుతిన్‌తో జరిగిన చర్చలు ఫలప్రదంగా జరిగాయి. అనేక అంశాలపై ముందడుగు వేసాం. కానీ కొన్ని సమస్యలు ఇంకా పరిష్కారం కావాల్సి ఉంది. అందుకే ఒప్పందం తుది దశకు రాలేదు" అని వెల్లడించారు. త్వరలోనే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, యూరోపియన్ యూనియన్ నేతలతో మాట్లాడతానని, అనంతరం పుతిన్‌తో మళ్లీ కలుస్తానని ట్రంప్ తెలిపారు.

పుతిన్ కూడా ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ, "అలాస్కాలో ట్రంప్‌తో భేటీ చాలా నిర్మాణాత్మకంగా సాగింది. ఉక్రెయిన్ సమస్యకు పరిష్కారం దిశగా ఇది ప్రారంభమైన చర్చ. యుద్ధాన్ని ముగించేందుకు నేను నిజాయతీగా కృషి చేస్తున్నాను" అని అన్నారు. "ట్రంప్‌తో నా సంబంధం ఎల్లప్పుడూ మంచిదే. ఆయన ఉండి ఉంటే 2022లో ఉక్రెయిన్ యుద్ధం జరిగేది కాదు" అని పుతిన్ పేర్కొన్నారు.

భేటీకి ముందే పుతిన్, ట్రంప్ యాంకరేజ్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడే ఇద్దరూ కరచాలనం చేసుకుని, ట్రంప్ వాహనంలో సమావేశ ప్రాంగణానికి వెళ్లారు. మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకపోవడంతో, చర్చల అనంతరం ఏమి ప్రకటిస్తారోనన్న ఉత్కంఠ నెలకొంది. చివరికి, "కాల్పుల విరమణపై ఒప్పందం కుదరలేదు" అని ఇరువురు నేతలు స్పష్టం చేశారు.

## హిమాచల్‌లో వర్ష బీభత్సం

- **257 మంది మృతి**
- **రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ నివేదిక**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హిమాచల్ ప్రదేశ్‌లో జూన్ 20 నుంచి కురుస్తున్న వర్షాల బీభత్సం ఇప్పటివరకు 257 మందిని బలిగొంది. రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ శనివారం ఈ వివరాలను వెల్లడించింది. మండీ జిల్లా (26 మరణాలు), కంగ్రా (28), కులూ (11) జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. వర్షాల కారణంగా సంభవించిన కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు, గల్లంతు ఘటనలు, విద్యుదాఘాతం వల్ల 133 మంది, రోడ్డు ప్రమాదాల్లో 124 మంది మృతిచెందారని నివేదికలో పేర్కొంది. ప్రత్యేకంగా, కొండచరియలు విరిగిపడటంతో 16 మంది, వరదలలో కొట్టుకుపోయి 27 మంది ప్రాణాలు కోల్పోయారు. పిడుగుపాటు, అగ్నిప్రమాదాలు, పాము కాట్లు, ప్రమాదవశాత్తు పడిపోవడం వంటి కారణాలతో కూడా చాలామంది మృతిచెందారు.

**మహారాష్ట్రలో ఐదుగురి మృతి**

మరోవైపు, మహారాష్ట్రలో కూడా భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. గడచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఇప్పటివరకు 5 మంది మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. ముంబైలోని వఖ్రోలీ ప్రాంతంలో శనివారం ఉదయం కొండచరియ విరిగి ఓ ఇంటిపై పడటంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. జనకళ్యాణ్ సొసైటీకి చెందిన ఆ ఇంట్లో సంఘటన సమయంలో కుటుంబ సభ్యులు నలుగురూ ఉన్నారు. అదేవిధంగా, ముంబై నగరంలోని అనేక ప్రాంతాలు నీటమునిగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## గృహ రుణాలపై ఎస్‌బిఐ వడ్డీ రేట్ల పెంపు


**బలగం టీవీ, ముంబై**

దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) గృహ రుణాలపై వడ్డీ రేట్లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అయితే నూతన రుణ గ్రహీతలపై మాత్రమే 25 బేసిస్ పాయింట్లు (పావు శాతం) పెంచుతున్నట్లు శనివారం వెల్లడించింది. సవరించిన వడ్డీరేట్లు ఆగస్టు 1 నుంచే అమల్లోకి వచ్చినట్లు వెల్లడించింది. ముఖ్యంగా సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్న ఖాతాదారులపై ఇది ఎక్కువ ప్రభావం చూపనుందని తెలిపింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా వడ్డీ రేట్లను పెంచింది. ఇతర బ్యాంక్‌లు కూడా ఇదే బాటలో నిర్ణయం తీసుకొవచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కాల వ్యవధిని బట్టి గృహ రుణాల వడ్డీరేట్లలో తేడా ఉండనుంది. ఇప్పటివరకు ఎస్‌బిఐ గృహ రుణ రేట్లు 7.50 శాతం నుంచి 8.45శాతంగా ఉండగా.. తాజా పెంపునతో ఇది 7.50శాతం నుంచి 8.70 శాతానికి పెరిగింది. సిబిల్ స్కోరు తక్కువగా ఉండేవారికి ఇకపై అధిక వడ్డీ రేట్లను చెలించాల్సి ఉంటుంది.

"సిబిల్ స్కోరు, ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు ఆధారంగా విధించే వడ్డీరేట్లలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్పులు చేసింది. గృహ రుణాలపై మార్జిన్ పెంచుకునేందుకే వడ్డీరేట్లను పెంచాం. ఈ పెంపు కేవలం కొత్త కస్టమర్లకు మాత్రమే. ఇప్పటికే తీసుకున్న గృహరుణాలకు

## దక్షిణాదిలో అబార్షన్ల పెరుగుదల

- **రాష్ట్రంలో పదిరెట్లు పెరిగిన అబార్షన్లు**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దక్షిణాదిలో గడిచిన ఐదేళ్ల వ్యవధిలో అబార్షన్లు గణనీయంగా పెరిగాయి. కేంద్ర ఆరోగ్యశాఖ సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. దేశ వ్యాప్తంగా పరిశీలిస్తే మహారాష్ట్ర దేశంలోనే ముందుంది. ఈ రాష్ట్రంలో ఈ ఏడాది 2,07,019 అబార్షన్లు జరిగాయి. రెండో స్థానంలో తమిళనాడు నిలిచింది. ఇక్కడ 1,01,414 అబార్షన్లు జరిగాయని నివేదిక తెలిపింది. 3,4,5 స్థానాల్లో అసోం (76,642) , కర్ణాటక (70,241), రాజస్థాన్(53,714) ఉండడం గమనార్హం. తెలంగాణ విషయానికి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక సమస్యలు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. ఐదేళ్ల క్రితం 2020 -21 లో 1,578 అబార్షన్లు నమోదవగా ఈ ఏడాది ఏకంగా 917 శాతం పెరిగి 16,059 నమోదు కావడం ఆందోళన కలిగించే అంశం. కేంద్ర ఆరోగ్యశాఖ నిర్వహించిన సర్వే వివరాలను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ ఇటీవల పార్లమెంటుకు సమర్పించారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

అక్కడ ఐదేళ్లలో అబార్షన్స్ నాలుగు రెట్లు పెరిగాయి. 2020- 21లో 2,282 ఉండగా, 2024-25 నాటికి 10,676కు పెరిగాయి. ఈ లెక్కన ఏపీలో 317శాతం అబార్షన్లు పెరిగినట్టు నివేదికలో ఉంది. గర్భా విచ్ఛిత్తులకు అనేక కారణాలున్నాయని తెలుస్తోంది. అందులో ఆర్థిక పరమైన కారణాలతో పాటు అనారోగ్య సమస్యల కారణంగా కూడా కొందరు గర్భా విచ్ఛిత్తులు చేయించుకుంటున్నట్టు తెలుస్తోంది. పోషణ భారమని భావించి కొందరు అబార్షన్లు చేయించుకుంటున్నట్టు తెలుస్తోంది. పట్టణాలు, నగరాల విషయాన్ని పరిశీలిస్తే ఇందుకు భిన్నంగా ఉంది. భార్యాభర్తలిద్దరూ సంపాదిస్తున్నా.. ఆలస్యంగా పిల్లలను కనేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో గర్భం వస్తే అబార్షన్లు చేయించుకుంటున్నట్టు తేలింది. దీంతో పాటు పరిమిత సంతానం అనే భావన కూడా గర్భా విచ్ఛిత్తులకు కారణమవుతోందని సమాచారం. కొన్ని సంవత్సరాల క్రితం వరకు ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకునేవారు. ఇప్పుడు అధిక జీవన వ్యయాలు, ఇతర ఖర్చుల కారణంగా ఒక బిడ్డకే పరిమితమవుతున్నారని హైదరాబాద్ కు చెందిన సీనియర్ గైనకాలజిస్ట్ తెలిపారు.

## పోలవరంపై మౌనం ఎందుకు..?



- **పోలవరం కాఫర్ డ్యామ్, రెండో సారి కొట్టుకుపోయినా ఎన్‌డిఎస్‌ఎకు కనిపించడం లేదా..?**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణకు వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక నీతి.. పోలవరం ప్రాజెక్టుకు మరో నీతా..? అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. జాతీయ హోదా ఇచ్చి మరీ.. సాక్షాత్తూ ఎన్‌డిఎ ప్రభుత్వం నిర్మిస్తున్న పోలవరం కాఫర్ డ్యామ్, రెండో సారి కొట్టుకుపోయినా ఎన్‌డిఎస్‌ఎకు కనిపించడం లేదా..? అని అడిగారు. తెలంగాణకు వరప్రదాయినైన కాళేశ్వరం ప్రాజెక్టుపై ఒక నీతి, పోలవరం ప్రాజెక్టుపై మరో నీతి ఎందుకు..? అని నిలదీశారు.

**"కూలేశ్వరం" అన్నవారు ఇప్పుడు మౌనమేనా..?**

కాళేశ్వరంలోని మేడిగడ్డలో రెండు పిల్లర్లకు పగుళ్లు వస్తే పెద్ద ఎత్తున విమర్శలు చేసిన కాంగ్రెస్, బీజేపీ నేతలు.. రెండోసారి కొట్టుకుపోయిన పోలవరం కాఫర్ డ్యామ్‌పై "కూలవరం" అన్న ధైర్యం ఎందుకు చేయలేకపోతున్నారు..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఏకంగా 10 అడుగుల వెడల్పు, 7-8 అడుగుల లోతుకు కుంగిన పోలవరం కాఫర్ డ్యామ్‌ను ఆంధ్రప్రదేశ్‌లో గుట్టుచప్పుడు కాకుండా రిపేర్ చేస్తుంటే, తెలంగాణలో మాత్రం 20 నెలలు కావస్తున్నా మేడిగడ్డ వద్ద తట్టెడు సిమెంట్‌కూ దిక్కులేదని మండిపడ్డారు.

2020లో పోలవరం డయాఫ్రం వాల్ కొట్టుకుపోయినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇటీవల ఏపీలో పోలవరం కాఫర్ డ్యామ్ గోదావరిపాలైనా, తెలంగాణలో ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలి 8 మంది ప్రాణాలు కోల్పోయినా ఎన్‌డిఎస్‌ఎ ఎక్కడా కనబడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పంజాబ్‌ను తలదన్నే స్థాయిలో తెలంగాణ రైతును వ్యవసాయ విప్లవం వైపు నడిపించిన కేసీఆర్‌పై కక్షతోనే కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీజేపీలు మూకుమ్మడి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణకు జీవనాడి అయిన కాళేశ్వరాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. జై తెలంగాణ, జై కాళేశ్వరం అని నినదించారు.

## నేటి నుంచి ఓట్ అధికార్ యాత్ర



- **బీహార్‌లో 16 రోజులు.. 1300 కిలోమీటర్లు ప్రయాణం**
- **ఓట్ల చోరీపై 'లాపతా ఓట్' వీడియోను విడుదల చేసిన రాహుల్ గాంధీ**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఎన్నికల సంఘం బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు, ప్రజల ఓటు హక్కుపై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆదివారం 'ఓట్ అధికార్ యాత్ర'ను చేపట్టనున్నట్టు కాంగ్రెస్ సీనియర్ నేత అఖిలేశ్ ప్రసాద్ సింగ్ తెలిపారు. ఈ యాత్ర ద్వారా 16 రోజులు..1300 కిలోమీటర్ల పరిధిలోని ఓటర్లకు అవగాహన కల్పించనున్నట్టుఆయన వివరించారు. శనివారం పాట్నాలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'బీహార్‌లో ఓట్ అధికార్ యాత్రను ఆదివారం ససారం నుంచి రాహుల్ గాంధీ ప్రారంభించనున్నారు. ఈ యాత్ర ముగిసేవరకు రాహుల్ రాష్ట్రంలోనే ఉండనున్నారు. ఈ యాత్ర కోసం ముందుగానే అనుమతులు తీసుకున్నాం. ఈ యాత్ర రాష్ట్రంలోని 24 జిల్లాలు, 118 నియోజకవర్గాలను కవర్ చేస్తుంది. ఆగస్టు 20, వివరాలు 2వ పేజీలో

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి



- **మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జూబ్లీహిల్స్‌లోని పలు కాలనీల్లో అన్ని వసతులు కావాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఉప ఎన్నికల్లో గెలిపించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఉప ఎన్నిక ప్రచారం లో భాగంగా మంత్రి తుమ్మల పార్టీ కార్యకర్తలను ఉదేశించి శనివారం మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఎన్నికల్లో ఎలాగైనా కాంగ్రెస్ విజయం సాధించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్ నగరానికి ఎన్నో అవకాశాలు వచ్చాయి,మాదాపూర్,హైటెక్ సిటీ రోజు రోజుకు అభివృద్ధి చెందుతోందని తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని ఉన్న స్లమ్ ఏరియాలు అభివృద్ధి చెందాలి అంటే కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బలోపేతం చేయాలని, తమది మాటల ప్రభుత్వం కాదని చేత ప్రభుత్వమని స్పష్టం చేశారు. గతంలో 10 సంవత్సరాలుగా పరిపాలించిన పార్టీ ఏమి చేయాలేదని విమర్శించారు.

వారి మాటలు నమ్మి మోసపోవద్దని, స్కాంలు, ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పిడిన వారు కాంగ్రెస్ ప్రభుత్వంపై మాట్లాడడం సరికాదని అన్నారు. నేతలంతా కలిసి ఐక్యంగా పని చేయాలి, బూత్ స్థాయి నుండి కోఆర్డినేట్ చేసుకొని ప్రతి వంద ఓట్ల వివరాలు మన వద్ద ఉండాలని అన్నారు .ప్రతి బూత్ లో కాంగ్రెస్ పార్టీకి భారీ మెజారిటీ రావాలి ఆయన వెల్లడించారు . కాంగ్రెస్ ప్రభు-త్వాన్ని బలోపేతం చేయండి, తమది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని అన్నారు. మన పిల్లలు మనమంతా సుఖ సంతోషాలతో బతకాలి అంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఉండాలని ప్రజలు కోరుకొని మనకు పట్టం కట్టారని తెలిపారు . జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీలోకి ఎవరు వచ్చినా మద్దతు తెలిపి ఆహ్వానించాలని అన్నారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్, కార్పొరేషన్ చైర్మన్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హైదరాబాద్ ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ శుభవార్త

- **టీఏవైఎల్ టిక్కెట్‌పై రూ. 10-20 తగ్గింపు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భాగ్యనగర ప్రజలకు టీజీఎస్ఆర్టీసీ శుభవార్తను అందించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'ఫ్రీడమ్ ఆఫర్' కింద ట్రావెల్ యాజ్ యు లైక్ (టీఏవైఎల్) టిక్కెట్ ధరను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. పరిమిత కాలం వరకు మాత్రమే ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. ఆగస్టు 15 నుంచి 31వ తేదీ వరకు తగ్గింపు ధరలు ప్రయాణికులకు లభ్యం కానున్నాయి. మెట్రో డీలక్స్ బస్సులతో పాటు సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 24 గంటల పాటు ఈ టిక్కెట్లను కొనుగోలు చేసే సౌకర్యం కల్పించారు. పెద్దలకు ఇంతకుముందు టిక్కెట్ ధర రూ. 150 కాగా, ఆఫర్ కింద రూ. 130కి తగ్గించారు. మహిళలు, సీనియర్ సిటిజన్స్‌కు ఇంతకు ముందు రూ. 120గా ఉన్న టిక్కెట్ ధరను రూ. 110కి తగ్గించారు. పిల్లలకు రూ. 100 ఉండగా, దీనిని రూ. 90కి సవరించారు.

# దొంగతనం జరిగిన 24 గంటల్లోనే ముగ్గురు అరెస్ట్

- సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ కె.కృష్ణ




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

స్థానిక బస్టాండ్‌లో ఓ మహిళ బ్యాగ్‌లో నుంచి 14 తులాల బంగారు నగలను దొంగిలించిన ముగ్గురు దొంగలను పోలీసులు 24 గంటల్లోనే అరెస్టు చేశారు. వారి నుంచి దొంగిలించబడిన బంగారాన్ని, ఐదు స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు పంపారు. ఈ వివరాలను సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ కె. కృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 13న నిర్మల్ నివాసి పడాల స్రవంతి పెళ్లికి హాజరై తిరిగి వెళ్తుండగా, పాత బస్టాండ్ వద్ద బస్సు ఎక్కే సమయంలో ఆమె హ్యాండ్‌బ్యాగ్‌లోని బంగారు ఆభరణాలు ఉన్న ప్లాస్టిక్ బాక్స్ కనిపించకుండా పోయింది. ఇందులో సుమారు 14 తులాల బంగారం ఉందని ఆమె మరుసటి రోజు (ఆగస్టు 14) పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి, మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నిందితులు వల్లాపు ఆంజనేయులు (ఏ1), సంకంబ్లె రాజేశ్వరి (ఏ2), డొక్క బాలవ్వ (ఏ3) లను సిసిటివి ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టి ముగ్గురు నిందితులను గుర్తించారు. పట్టుబడిన నిందితులు గత కొన్ని నెలలుగా రద్దీగా ఉండే ప్రదేశాల్లో ఇలాంటి చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును వేగంగా పరిష్కరించిన పోలీస్ సిబ్బందిని ఇన్స్పెక్టర్ కృష్ణ అభినందించారు.

ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కృష్ణ ప్రజలకు కొన్ని ముఖ్యమైన సూచనలు తెలిపారు.. రద్దీగా ఉండే ప్రదేశాలకు వెళ్ళినప్పుడు మీ విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బయటకు వెళ్లేటప్పుడు ఇంటికి తాళం వేసి వెళ్ళున్నట్లయితే, ఆ విషయాన్ని తప్పనిసరిగా పోలీసులకు తెలియజేయాలని, నేరాలను అరికట్టేందుకు ప్రతి ఇంటికి సిసిటివి కెమెరాలు, సెంట్రల్ లాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారా నేరాల నియంత్రణలో భాగస్వాములు కావాలని సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ కె. కృష్ణ కోరారు.



## పాకిస్థాన్, పీఓకేలో భారీవర్షాలు

### మూడు రోజుల్లో 321 మంది మృతి

**బలగం టీవీ, హైదరాబాద్**

పాకిస్థాన్ మరియు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలు ప్రళయాన్ని సృష్టించాయి. ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగి పడటంతో భారీ విధ్వంసం చోటుచేసుకుంది. అధికారుల ప్రకారం, రెండు రోజుల్లోనే 321 మంది మృతి చెందగా, వీరిలో 307 మంది ఖైబర్‌పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోనే ప్రాణాలు కోల్పోయారు. లోయర్ దిర్, బజౌర్, లబోటాబాద్, జబ్రారీ ప్రాంతాల్లో వరదలు, కొండచరియలు ప్రళయాన్ని సృష్టించాయి. పదుల సంఖ్యలో భవనాలు, పాఠశాలలు ధ్వంసమవగా, పలు వంతెనలు వరదలో కొట్టుకుపోయాయి. అనేక రహదారులు జలదిగ్బంధమయ్యాయి. వరదలతో అనేక మంది గల్లంతు కాగా, వారిని వెలికి తీసేందుకు ముమ్మర శోధన కొనసాగుతోంది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు దాదాపు 2 వేల మందితో ఆపరేషన్ కొనసాగుతున్నట్టు విపత్తు నిర్వహణ విభాగం వెల్లడించింది. ఇదిలా ఉండగా, పాక్‌లోని మరిన్ని ప్రాంతాల్లో కూడా భారీవర్షాల ముప్పు ఉందని స్థానిక వాతావరణ శాఖ హెచ్చరించింది.

## ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టా చేసుకుని మోసం... నిందితుడి అరెస్టు

**సిరిసిల్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ కె.కృష్ణ**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టా చేసుకుని, ప్రభుత్వ పథకాల ద్వారా డబ్బులు పొందిన కేసులో సిరిసిల్ల పట్టణానికి చెందిన మేడుదుల మొండయ్యను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. సిరిసిల్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ కె.కృష్ణ ఈ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ కె.కృష్ణ మాట్లాడుతూ.. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్ద బోనాల శివారులో ఉన్న సర్వే నం. 155లోని 2 ఎకరాల భూమిని గతంలో రెవెన్యూ సిబ్బందిగా (వీఆర్‌ఏ) పనిచేసి, ప్రస్తుతం నీటిపారుదల శాఖలో లష్కర్‌గా పనిచేస్తున్న మేడుదుల మొండయ్య అక్రమంగా పట్టా చేసుకున్నాడు. అధికారులను తప్పుదోవ పట్టించి, ఆన్‌లైన్ రికార్డులలో తన పేరు నమోదు చేసుకుని పట్టాదారు పాస్‌బుక్‌ను పొందాడు. దీంతో ప్రభుత్వం చేపట్టిన భూసేకరణలో భాగంగా ఈ భూమికి సంబంధించి అతడికి పరిహారం కూడా లభించింది.

అయితే, ఈ భూమి వాస్తవానికి ఒక మహిళకు చెందింది. ఆమె ఈ విషయంపై ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, కోర్టు ఆమెకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ సూచనల మేరకు సిరిసిల్ల తహసిల్దార్ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. మేడుదుల మొండయ్యను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

## యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ

### శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు

**బలగం టీవీ, యాదగిరిగుట్ట**



తెలంగాణ ప్రసిద్ధి క్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వరుస సెలవులు రావడంతో వివిధ ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. శ్రావణమాసం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. శనివారం తెల్లవారుజామున ఆలయ ద్వారాలను తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనానికి అనుమతించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీసుదర్శన నారసింహ హెూమం, నిత్యకల్యాణం, నిత్యబ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణపుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలు ఘనంగా నిర్వహించబడ్డాయి. తరువాత భక్తులు కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంతో పాటు పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని దర్శించుకున్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ నిత్యరాబడిలో శనివారం రూ.50,84,453 వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇందులో ప్రధాన బుకింగ్ ద్వారా రూ.3,57,100, బ్రేక్ దర్శనం ద్వారా రూ.4,44,600, వీఐపీ దర్శనం ద్వారా రూ.9,00,000, కొండపై వాహన ప్రవేశం ద్వారా రూ.6,42,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.1,18,816, ప్రసాద విక్రయం ద్వారా రూ.16,22,570, కల్యాణకట్ట ద్వారా రూ.1,05,100, ఇతర శాఖలతో పాటు పాతగుట్ట ఆలయం ద్వారా కూడా ఆదాయం లభించినట్లు అధికారులు వెల్లడించారు.

### ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

యాదగిరిగుట్ట దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం గోశాలలో గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహ్మామూర్తి, ఆలయ అధికారులు, సిబ్బంది, గోశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నచ్చని వారిపై అధికారాన్ని వినియోగించడం మూర్ఖత్వం

(మొదటి పేజీ తరువాయి)

చూడను. నేను కర్మ సిద్ధాంతాన్ని విశ్వసిస్తా. 2006 లో జెడ్పీటీసీ సభ్యుడిగా, 2007 లో ఎమ్మెల్సీగా, 2009 ఎమ్మెల్యేగా, 2014 లో ఎంపీగా, 2023 సీఎంగా... తెలంగా ణ ప్రజలు పెద్ద బాధ్యతను నా భుజాల పై పెట్టారు. ఏ హెూదా నిర్వహించకుండానే, ఏ మంత్రి పదవి చేపట్టకుండానే ఈ పదవిలోకి వచ్చానంటే భగవంతుడు ఏదో బాధ్యత నాపై పెట్టాడని బలంగా నమ్ముతాను.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారు చెప్పినట్టు అభివృద్ధి అంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదు. పేదవాడు ఆత్మగౌరవంతో తలెత్తుకుని బతకగలగాలి. సొంతింటి కల నిజమైనప్పుడే పేదవాడు ఆత్మగౌరవడంతో నిలబడగలుగుతాడు. అందుకోసమే తొలి విడతగా 4 లక్షల మందికి ఇందిరమ్మ ఇండ్లను చేపట్టాం. సన్నబియ్యంతో అన్నం తింటున్నారంటే అది వారికి ఆత్మగౌరవం. ఈరోజు రాష్ట్రంలో 3.10 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నాం. 10 సంవత్సరాలుగా రేషన్ కార్డు రాక, మాకంటూ ఒక గుర్తింపు లేదని బాధ పడుతుంటే ప్రభుత్వం ఈరోజు రేషన్ కార్డులను అందిస్తోంది.నేనేమీ మీకన్నా గొప్పవాడిని కాదు. మీలో ఒకడిని. కవులు గూడ అంజన్న, దాశరథి కృష్ణమాచార్య, కాళోజీ నారాయణ రావు, అందెశ్రీ, గద్దర్, గోరటి వెంకన్న లాంటి ఎందరో మహానుభావులు ప్రజలను చైతన్య వంతులను చేయడంలో, తెలంగాణ సమాజానికి ఒక స్ఫూర్తిని నింపడంలో ఎంతగానో కృషి చేశారు.

నిజమైన ఉద్యమకారులెవరూ ఉద్యమకారుడినని చెప్పుకోరు. చాలా మంది ఉద్యమకారులు సర్వం కోల్పోయారు. ఆస్తులు, అంతస్తులు సర్వస్వం కోల్పోయారు. ఉద్యమకారులనే గొప్ప పదాన్ని మాకు మేము ఆపాదించుకోవడం సరికాదు. అందెశ్రీ, గద్దర్ లాంటి వారు ఏమీ ఆశించకుండా ప్రజలకు ప్రేరణ ఇవ్వాలన్న ఒక సంకల్పంతో వారు నడిచారు.దేశ స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడమే నా లక్ష్యం. అందుకోసం నిరంతరం కృషి చేస్తా..” అని ముఖ్యమంత్రి గారు చెప్పారు.ఈ పుస్తకావిష్కరణ మహెూత్సవంలో ముఖ్యమంత్రి కార్యాలయం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాస రాజు గారు, శ్రీరామ్ సర్ గారు, ప్రజా కవి అందెశ్రీ గారు, డాక్టర్ నోరి దత్తాత్రేయుడు గారు, రామకృష్ణానంద గారితో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

## దేశం గర్వించదగిన గిరిజన నేత శిబుసోరెన్



**బలగం టీవీ, హైదరాబాద్**

దేశం గర్వించదగిన గిరిజన నేత, దిషోం గురు, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబుసోరెన్ గారికి ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ఘనంగా నివాళులర్పించారు. శిబుసోరెన్ స్వంత గ్రామం జార?ండ్ రామ్‌గఢ్ జిల్లాలోని నమ్రాలో సంప్రదాయ గిరిజన ఆచారాలతో నిర్వహించిన దిషోం గురు శ్రద్ధాంజలి కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా శిబుసోరెన్ గారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి వారి సేవలను స్మరించుకున్నారు. శిబు సోరెన్ గారు జార?ండ్ కు మాత్రమే కాకుండా దేశంలోని గిరిజన, అణగారిన వర్గాల పక్షాన బలమైన స్వరం వినిపించారని, వారి జీవితం ఆ వర్గాల కోసం అంకితం చేశారని కొనియాడారు. గిరిజన సమాజ ప్రయోజనాల కోసం శిబుసోరెన్ గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఈ సందర్భంగా శిబు సోరెన్ కుమారుడు, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తో పాటు కుటుంబ సభ్యులకు వ్యక్తిగతంగా ముఖ్యమంత్రి గారు సంతాపాన్ని ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# నేటి నుంచి ఓట్ అధికార్ యాత్ర

(మొదటి పేజీ తరువాయి)

25, 31 తేదీల్లో యాత్రకు విరామం. సెప్టెంబర్ 1న పాట్నాలో జరిగే ర్యాలీతో ఈ యాత్ర ముగుస్తుంది. ఈ యాత్రలో బీహార్ అసెంబ్లీ ప్రతిపక్షనేత తేజస్వీయాదవ్ పాల్గొననున్నారు. ఆర్జేడీతోపాటు ఇండియా బ్లాక్‌లోని ఇతర పార్టీలైన వామపక్ష పార్టీల నేతలు కూడా పాల్గొననున్నారు' అని ఆయన అన్నారు.

**ఓట్ల చోరీపై 'లాపతా ఓట్' వీడియోను విడుదలచేసిన రాహుల్‌గాంధీ**

బీహార్ ఓటర్ల జాబితాలో లోపాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. దీనికి వ్యతిరేకంగా ఆయన శనివారం 'లాపతా ఓట్' (ఓట్లు కోల్పోయిన) అనే టైటిల్‌తో వీడియోను ఎక్స్‌లో విడుదల చేశారు. నిమిషం నిడివి ఉన్న ఆ వీడియోలో.. పోలీస్‌స్టేషన్‌లో ఓ వ్యక్తి తన ఓటు చోరీ చేశారని, ఇంకా లక్షల ఓట్లు చోరీ అయ్యాయని అధికారులకు ఫిర్యాదు చేస్తారు. పోలీసు సిబ్బంది చెక్ చేసి అందులో తమ ఓట్లు కూడా గల్లంతుకావడంతో నిర్ఘాంతపోతారు. అలా ఆ వీడియా ముగుస్తుంది.

దీనిని రాహుల్ తన అధికారిక ఎక్స్‌లో పోస్టు చేస్తూ.. “ఓటర్లందరూ చైతన్యంతో ఓ ఉద్యమంలా ముందుకు సాగాలి. మీ ఓటు చోరీ అయితే మీ ప్రాథమిక హక్కు చోరీ అయినట్లే ” అని పేర్కొన్నారు. దీనికి వ్యతిరేకంగా మనమందరం ఉద్యమంగా పోరాడి మన హక్కులను కాపాడుకుందామని తెలిపారు.

ఓట్ల చోరీ అనేది 'డూ ఆర్ డై' సమస్యగా కాంగ్రెస్ పేర్కొంది. ఓట్లు గల్లంతైన వారి కోసం ఓ వెబ్ పోర్టల్‌ను కూడా ప్రారంభించింది. అందులో పోల్ ప్యానెల్ నుంచి ఓట్ల గల్లంతుకు వ్యతిరేకంగా నమోదు చేసుకోవడానికి, అధికారుల నుంచి జవాబుదారీతనం కోరడానికి, డిజిటల్ ఓటరు జాబితాల డిమాండ్‌కు మద్దతు తెలియజేయడానికి ఆ వెబ్ పోర్టల్‌ను ప్రారంభించింది.




## బీసీసీఐ కొత్త నిబంధన

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇంగ్లండ్ పర్యటనలో గాయపడ్డ రిషభ్ పంత్‌కుంటుతూనే క్రీజులోకి వచ్చి బ్యాటింగ్ చేసిన ఘటన అందరికీ గుర్తే. పాద వేళ్ల ఎముక విరిగినా జట్టును ఆదుకోవాలని క్రీజులోకి వచ్చి హాఫ్ సెంచరీ బాదాడు. ఇదే తరహాలో ఇంగ్లండ్ పేసర్ క్రిస్ వోక్స్ భుజం గాయంతో బాధపడుతూ కూడా చేతికి కట్టుతో రెండో ఇన్నింగ్స్‌లో ఆడాడు. ఈ సందర్భాల్లో రీప్లేస్‌మెంట్ ప్లేయర్ ఉంటే ఇబ్బందులు తప్పేవని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ పరిణామాల దృష్ట్యా భారత క్రికెట్ నియంత్రణ మండలి కీలక నిర్ణయం తీసుకుంది. 2025-26 దేశవాళీ క్రికెట్ సీజన్ నుంచే కొత్త రూల్ అమలులోకి వస్తుందని బీసీసీఐ ప్రకటించింది. మ్యాచ్ జరుగుతున్న సమయంలో ఒక ఆటగాడు తీవ్రంగా గాయపడితే అతడి స్థానంలో మరొకరిని ఆడించేలా అవకాశం కల్పిస్తామని స్పష్టం చేసింది. అయితే.. ఆ గాయం మైదానంలోనో లేదా మ్యాచ్ జరుగుతున్నప్పుడో జరగాలి. అలాంటప్పుడే రీప్లేస్‌మెంట్‌కు అనుమతి ఉంటుందని నిబంధనలలో పేర్కొంది. బీసీసీఐ ఈ కొత్త రూల్‌కు భారత కోచ్ గౌతం గంభీర్ మద్దతు తెలిపారు. కానీ ఇంగ్లండ్ సారథి బెన్ స్టోక్స్ మాత్రం ఇది సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డాడు.



## సౌతాఫ్రికాపై ఆసీస్ సిరీస్ విజయం

**బలగం టీవీ, హైదరాబాద్**

సొంతగడ్డపై జరిగిన మూడు టీ20ల సిరీస్‌లో ఆస్ట్రేలియా ఘనవిజయం సాధించింది. శనివారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో గ్లేన్ మ్యాక్స్‌వెల్ (36 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 62 నాటౌట్) విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆసీస్ 2 వికెట్ల తేడాతో గెలుపొందింది. దీంతో సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది.

ముందుగా బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 172 పరుగులు చేసింది. బ్రెవిస్ (26 బంతుల్లో 1 ఫోర్, 6 సిక్స్‌లతో 53) హాఫ్ సెంచరీతో మెరిశాడు. రాసీ వాన్ డెర్ డస్సెన్ (38 నాటౌట్), రిస్టన్ స్టబ్స్ (25) సహకరించారు. ఆసీస్ బౌలర్లలో నాథన్ ఎల్లిస్ (3/31) అద్భుత ప్రదర్శన చేశాడు. హాజెల్‌వుడ్ (2/30), జంపా (2/24) తలో రెండు వికెట్లు తీశారు. 173 పరుగుల విజయ లక్ష్యాన్ని చేధించడంలో ఆసీస్ 19.5 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. మ్యాక్స్‌వెల్‌తో పాటు కెప్టెన్ మిచెల్ మార్ష్ (37 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లతో 54) హాఫ్ సెంచరీతో రాణించాడు. సౌతాఫ్రికా బౌలర్లలో రబడా (2/32), మఫకా (2/36) రెండేసి వికెట్లు, కోర్బిన్ బోచ్ (3/26) మూడు వికెట్లు తీశారు. చివరి 12 బంతుల్లో ఆసీస్‌కు 12 పరుగులు అవసరమయ్యాయి. 19వ ఓవర్‌లో బోచ్ అద్భుతంగా బౌలింగ్ చేసి రెండు వికెట్లు పడగొట్టి కేవలం 2 పరుగులే ఇచ్చాడు. దీంతో చివరి ఓవర్‌లో 10 పరుగులు అవసరమయ్యాయి. లుంగి ఎంగిడి వేసిన ఆఖరి ఓవర్‌లో మ్యాక్స్‌వెల్ రెండు బౌండరీలు బాది ఆసీస్‌కు విజయలాంఛనాన్ని అందించాడు.

## కుటుంబం అంతా కలిసి చూసేలా సుందరకాండ

- **నారా రోహిత్**



**బలగం టీవీ, హైదరాబాద్**

నారా రోహిత్ కెరీర్‌లో 20వ సినిమా సుందరకాండ . వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సందీప్ పిక్చర్స్ ప్యాలెస్ బ్యానర్‌పై సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఆగస్టు 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో చిత్రబృందం మాట్లాడింది."సుందరకాండ ట్రైలర్, సాంగ్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా చాలా కొత్తగా, మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా ఉంటుంది. కుటుంబం అంతా కలిసి చూసేలా రూపొందించాం. వినాయక చవితి సందర్భంగా సినిమా రిలీజ్ అవ్వడం ఎంతో హ్యాపీగా ఉంది. మా కో-స్టార్స్, టెక్నీషియన్స్ అందరికీ ఇది మంచి జ్ఞాపకం అవుతుంది. సినిమా మంచి హిట్ అవుతుందని నమ్ముతున్నాను. ట్రైలర్ ని లాంచ్ చేసిన ప్రభాస్ గారికి ప్రత్యేకంగా థాంక్స్. వినాయక చవితి రోజు ఫ్యామిలీ అంతా కలిసి థియేటర్స్‌లో సినిమా చూడాలని కోరుకుంటున్నాను" అని నారా రోహిత్ అన్నారు."ఈ సినిమా విడుదల కోసం మేమంతా ఎంతగానో ఎదురు చూస్తున్నాం. చాలా కాలం తర్వాత చేసిన ఈ సినిమా నాకు ఎంతో ఆనందం ఇచ్చింది. మా సినిమా ట్రైలర్ ని లాంచ్ చేసిన ప్రభాస్ గారికి థాంక్స్. ఈ సినిమాకి సపోర్ట్ చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఇది మంచి ఎంటర్టైనర్. థియేటర్‌కి వచ్చి అందరూ హ్యాపీగా చూడొచ్చు" అని నటి శ్రీదేవి విజయ్ కుమార్ తెలిపారు.

## "కార్మికులకు మేము వ్యతిరేకం కాదు"

### ప్రెస్‌మీట్ నిర్వహించిన మైత్రి మూవీ మేకర్స్

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలుగు సినీ పరిశ్రమలో కార్మికుల వేతనాల పెంపు డిమాండ్‌తో జరుగుతున్న సమ్మెపై చర్చలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఫెడరేషన్ నాయకులు, టాలీవుడ్ ప్రొడ్యూసర్ల మధ్య పలు దఫాలుగా చర్చలు జరిగినప్పటికీ ఇంకా పరిష్కారం లభించలేదు. ఈ నేపథ్యంలో ప్రముఖ నిర్మాతలు మైత్రి మూవీ మేకర్స్ చెర్రీ, వివేక్ కూచిభొట్ల, రాధామోహన్ శనివారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. కార్మికులకు తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు.

**నాలుగు ప్రతిపాదనలు ఉంచిన నిర్మాతలు**

నిర్మాతలు కార్మికుల ముందు నలుగురు ప్రతిపాదనలు ఉంచినట్లు వెల్లడించారు. వాటిలో 2022లోనే రెండింటికి కార్మికులు ఒప్పుకున్నారని, మిగిలిన రెండు ప్రతిపాదనల వద్దే చర్చలు ఆగిపోయాయని తెలిపారు.

"ఇండస్ట్రీలో సమస్య అసలు రూపంలో కార్మికులకు చేరడం లేదనేది మా అభిప్రాయం. అందుకే ఈ ప్రెస్‌మీట్ పెట్టాం. మేం చెప్పిన కండిషన్లు పెద్ద కష్టమైనవి కావు. ఇండస్ట్రీ పరిస్థితులు ప్రస్తుతం అంత బాగోలేవు. కాబట్టి కార్మికులు కూడా అర్థం చేసుకొని మాకు సహకరించాలి" అని నిర్మాత రాధామోహన్ అన్నారు.

## రివ్యూస్ బాగుంటే 'పరదా' చూడండి

- **అనుపమ పరమేశ్వరన్**

**బలగం టీవీ, హైదరాబాద్**

మలయాళ నటి, ప్రేమమ్ ఫేం అనుపమ పరమేశ్వరన్ లీడ్ రోల్‌లో నటిస్తున్న తాజా తెలుగు చిత్రం 'పరదా'. సినిమా బండి ఫేం ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మలయాళ నటీమణులు దర్శన, సంగీత కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమా ఆగస్టు 22న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రస్తుతం టీమ్ ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది. ఈ సందర్భంగా హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. "రివ్యూయర్లకు డబ్బులు ఇవ్వడానికి కానీ, రివ్యూలను మలచడానికి కానీ మా దగ్గర ఎలాంటి వనరులు లేవు. కాబట్టి 'పరదా' సినిమాకు వచ్చే రివ్యూలు పూర్తిగా స్వచ్ఛమైనవే. రివ్యూస్ బాగుంటే తప్పక థియేటర్లలో చూడండి. లేకుంటే సంతోషంగా పక్కన పెట్టేయండి" అంటూ తన ధైర్యాన్ని వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్ట్‌ను నిర్మాతలు శ్రీధర్ మక్కువ, విజయ్ డొంకాడ నిర్మిస్తున్నారు. మలయాళ థియేట్రికల్ రైట్స్‌ను స్టార్ హీరో దుల్కర్




సల్మాన్ సొంతం చేసుకున్నారు. ఆయన హోం బ్యానర్ వేఫరెర్ ఫిలిమ్స్ ద్వారా ఈ సినిమాను విడుదల చేయనున్నారు.

మిస్టికల్ థ్రిల్లర్‌గా రాబోతున్న 'పరదా' సంప్రదాయపు కట్టుబాట్లు మహిళలపై ఎలా అణచివేతకు దారితీస్తాయి? ఆ బంధనాలనుంచి మహిళలు ఎలా బయటపడతారు? అనే కాన్సెప్ట్‌తో వస్తున్నట్టు టీజర్‌లో హింట్ ఇచ్చారు.

## 'ఫ్రెండ్లీ ఘోస్ట్' ఫస్ట్‌లుక్ రిలీజ్




**బలగం టీవీ, హైదరాబాద్**

సత్యం రాజేశ్, రియా సత్యదేవ్ ప్రధాన పాత్రల్లో సస్పెన్స్ హారర్ కామెడీ మూవీ 'ఫ్రెండ్లీ ఘోస్ట్' రూపొందుతోంది. జి. మధుసూదన్‌రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని విశ్వనాథ్.డి.కె నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా శనివారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌ను నటుడు మంచు మనోజ్ ఆవిష్కరించి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మేకర్స్ సమాచారం ప్రకారం త్వరలోనే ఈ చిత్రంలోని పాటలు, టీజర్, ట్రైలర్ విడుదల కానున్నాయి. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా సినిమా రూపొందిందని వారు తెలిపారు. ఈ చిత్రంలో వెన్నెల కిశోర్, సునీత మరసియర్, శ్రీనివాసరెడ్డి, సప్తగిరి, మధునందన్, చమ్మక్ చంద్ర, 30 ఇయర్స్ పృథ్వీ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. కెమెరా: హారిజ్ ప్రసాద్, సంగీతం: భీమ్స్, సమర్పణ: మాస్టర్ జియాన్స్, నిర్మాణం: సుచిన్ సినిమాస్ లిమిటెడ్.

## 'మటన్ సూప్' టైటిల్ పోస్టర్ విడుదల


**బలగం టీవీ, హైదరాబాద్**




రామకృష్ణ వట్టికూటి సమర్పణలో అలుక్కా స్టూడియోస్, శ్రీ వారాహి ఆర్ట్, భవిష్య విహార్ చిత్రాల బ్యానర్లపై తెరకెక్కుతున్న చిత్రం మటన్ సూప్ . రమణ్, వర్షా విశ్వనాథ్ హీరో హీరోయిన్లుగా నటిస్తోన్న ఈ సినిమాకు రామచంద్ర వట్టికూటి దర్శకత్వం వహిస్తున్నారు.మల్లిఖార్జున ఎలికా (గోపాల్), అరుణ్ చంద్ర వట్టికూటి, రామకృష్ణ సనపల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను ప్రముఖ నిర్మాత కె.ఎస్. రామారావు శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కె.ఎస్. రామారావు మాట్లాడుతూ "పర్వతనేని రాంబాబు సారథ్యంలో రాబోతున్న 'మటన్ సూప్' టైటిల్ పోస్టర్ చాలా బాగుంది. సినిమా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను" అన్నారు.నిర్మాత మల్లిఖార్జున ఎలికా (గోపాల్) మాట్లాడుతూ 'మంచి చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం. అందరూ ఆదరిస్తారని ఆశిస్తున్నాం" అన్నారు.దర్శకుడు రామచంద్ర వట్టికూటి మాట్లాడుతూ "యథార్థ సంఘటనల ఆధారంగా 'మటన్ సూప్'ను తెరకెక్కించాం. త్వరలోనే సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి" అని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హీరో రమణ్, నిర్మాత రామకృష్ణ సనపల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ పర్వతనేని రాంబాబు, నిర్మాత అరుణ్ చంద్ర వట్టికూటి తదితరులు పాల్గొన్నారు.

## ఓజీ నుంచి ప్రియాంక మోహన్ ఫస్ట్ లుక్

**బలగం టీవీ, హైదరాబాద్**



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం ఓజీ నుంచి హీరోయిన్ ప్రియాంక అరుల్ మోహన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్ర బృందం శనివారం విడుదల చేసింది. ఈ చిత్రం లో ఆమె కన్మణి పాత్రలో ప్రేక్షకులను అలరించ నున్నారు.డీవీవీ ఎంటర్‌టైన మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. పవన్ కళ్యాణ్ గ్యాంగ్‌స్టర్ లుక్‌లో కనిపించ నున్న ఈ చిత్రం ఇప్పటికే విపరీతమైన అంచనాలు రేపింది. ఇప్పటిదాకా వచ్చిన ప్రచార చిత్రాలు యాక్షన్ థ్రిల్‌ను సూచించగా, తాజాగా విడుదలైన ప్రియాంక అరుల్ మోహన్ పోస్టర్లు విభిన్నంగా ఉన్నాయి. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మి, అర్జున్ దాస్, ప్రకాష్ రాజ్, శ్రియా రెడ్డి కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సంగీత సంచలనం ఎస్.తమన్ ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తున్నారు. ఓజీ చిత్రం సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది.